జయహో జగన్నాథా..

- జగన్నాథస్వామి రథోత్సవాలకు సర్వం సిద్ధం
- 7 నుంచి 9 రోజుల పాటు ఉత్సవాలు
- పూరీ తరహాలో నిర్వహణకు ఏర్పాట్లు

ఉక్కునగరం: జగన్నాథస్వామి నవరాత్రి మహోత్సవాలకు స్టీల్‌ప్లాంట్‌లోని ఆలయం ముస్తాబైంది. జూలై 7 నుంచి తొమ్మిది రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. పూరీ జగన్నాథస్వామి ఆలయంలో మాదిరిగానే ఉక్కునగరం ఆలయంలోనూ ఒడిశా పూజారులు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ప్రతీ ఏడాది ఆషాడ ద్వితీయ నాడు బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడు ఊరేగింపుగా సెక్టార్‌-8లో ఉన్న ఇంద్రద్యుమ్న హాల్లోకి వెళ్లి అక్కడ 9 రోజులు ఉండి, అనంతరం ఊరేగింపుగా తిరిగి ఆలయానికి చేరుకుంటారు. ఈ ఉత్సవ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీఎండీ బంగారు చీపురుతో రథాన్ని ఊడ్చి, రథాన్ని ఊరేగించటం ఆనవాయితీగా వస్తోంది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్టీల్‌ప్లాంట్‌లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, దేశంలోని ప్రముఖ కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తుంటారు. పూరీలో ఆదివారం నుంచి రథోత్సవాలు ప్రారంభం కానుండటంతో స్టీల్‌ప్లాంట్‌లోనూ అప్పటి నుంచి నిర్వహించడానికి నిర్వాహక కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 17 వరకు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం 7 గంటల నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాల మధ్య పూజలు నిర్వహించనున్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఉక్కునగరం, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు వేలాదిగా తరలిరానున్నారు.



పూజలు అందుకుంటున్న బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడు



ఉక్కు జగన్నాథ స్వామి ఆలయం



అద్భుత రీతిలో నిర్మాణం

ప్రఖ్యాతి గాంచిన పూరీ జగన్నాథస్వామి ఆలయాన్ని ఉక్కునగరంలో నిర్మించాలని స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న ఒడిశాకు చెందిన ఉద్యోగులు యాజమాన్యాన్ని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన యాజమాన్యం సెక్టార్‌-9లో మూడు ఎకరాల స్థలం కేటాయించింది. 2001లో నాటి సీఎండీ బి.ఎస్‌. సింగ్ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2003లో ఆలయ నిర్మాణ పనులు పూర్తి కావటంతో పూరీ రాజు దివ్య సింగ్ చేతుల మీదుగా ఆలయాన్ని ప్రారంభించారు. పూరీలో జగన్నాథస్వామి ఆలయాన్ని పోలినట్లు 70 అడుగుల ఎత్తులో ఆలయాన్ని నిర్మించారు. విగ్రహాలు కూడా పూరీలో మాదిరిగానే బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథుడు కొలువైన ప్రధాన ఆలయం చుట్టూ నలుగురు ఉత్సవమూర్తులు గణపతి, విమలాదేవి, మహాలక్ష్మి, హనుమాన్‌లకు చెందిన ఉప ఆలయాలను ప్రధాన ఆలయానికి నాలుగు వైపులా నిర్మించారు.

నవరాత్రి ఉత్సవాలు

తేదీ	కార్యక్రమాలు
జూలై 7	సాయంత్రం 3.30 గంటలకు రథయాత్ర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం శ్రీకృష్ణ కళామందిరం ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన
జూలై 8	భజరంగి భజన్ మంజరి ఆధ్వర్యంలో భజనలు
జూలై 9	శ్రీ సాయి కళా కేంద్రం ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన
జూలై 10	నిర్మల డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన
జూలై 11	వైశాలి డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఫోక్ డాన్స్
జూలై 12	శ్రీ వెంకటరమణ గ్రూప్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ లీలలు కూచిపూడి నృత్యం
జూలై 13	అగనంపూడి డాన్సింగ్ స్టెప్స్ గ్రూప్ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన
జూలై 14	సప్తేశ్వర భక్తి గీతాంజలి ఆధ్వర్యంలో భజనలు
జూలై 15	శశికిరణ్ బ్లూ-1 డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శన
జూలై 16	భజనలు, నృత్య, సంగీత ప్రదర్శనలు
జూలై 17	రాత్రి 7 నుంచి 10 గంటల వరకు సమారాధన

క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ప్రచారం చేస్తున్న సమితి ప్రతినిధులు

పెదగంట్యాడ: ప్రతి ఒక్కరూ భగవద్గీతను చదవాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, ఇందు జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. ఆచార్య ప్రబోధానంద యోగేశ్వర స్వామి రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతపై వుడా కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ ఆత్మ, జీవాత్మ, పరమాత్మ గురించి తెలియజేయడమే త్రైత సిద్ధాంత భగవద్గీత ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో అప్పారావు, రమణ, విజయ్, అరుణ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న యువకులు

పెదగంట్యాడ: సమతానగర్, గాజువాక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రోటరీ హోమియో క్లినిక్‌లో సోమవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్స్ డే పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శిబిరాన్ని రోటరీ క్లబ్ అధ్యక్షుడు సిరట్ల శ్రీనివాస్, హోమియో క్లినిక్ చైర్మన్ విక్టర్‌రాజు ప్రారంభించారు. రోటరీ బ్లడ్ బ్యాంక్ 65 మంది యువకుల నుంచి రక్తం సేకరించింది. బ్లడ్ బ్యాంక్ సిబ్బంది జీఎస్ రాజు, డాక్టర్ దీప్తి, డాక్టర్ జ్యోత్స్న, క్లబ్ సభ్యులు నక్క లక్ష్మణరావు, హేమంతరావు, జాన్ డీన్, గౌరీ, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

కన్జ్యూమర్ యాప్‌లోనే విద్యుత్ బిల్లుల చెల్లింపు

అగనంపూడి: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల మేరకు ఇక నుంచి విద్యుత్ బిల్లులను ఏపీఈపీడీసీఎల్ కన్జ్యూమర్ యాప్ ద్వారానే చెల్లించాల్సి ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ వడ్లపూడి ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటి వరకు ఫోన్ పే, జీపే, పేటీఎంతో పాటు ఇతర యూపీఐల్లో కనిపించే ఏపీఈపీడీసీఎల్ డిస్కమ్ పేరు కనపడదని, వాటి స్థానంలో ఏపీఈపీడీసీఎల్ కన్జ్యూమర్ యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సదరు యాప్ ద్వారానే విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

పింఛన్ల పంపిణీ



రామచంద్రనగర్‌లో దివ్యాంగుడికి పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పల్లా

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు రామచంద్రనగర్‌లో దివ్యాంగులకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, జనసేన నాయకుడు కోన తాతారావు, నాయకులు పాల్గొన్నారు.

అగనంపూడి: 85వ వార్డు పెదమడక వార్డు సచివాలయ పరిధిలో పెన్షన్ల పంపిణీని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇల్లపు ప్రసాద్, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు, వార్డు టీడీపీ అధ్యక్షుడు కర్రి దోేంద్ర తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 65, 69, 67, 75, 76, 87 వార్డుల్లో నిర్వహించిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఆయా వార్డుల కార్పొరేటర్లు, నాయకులు, వార్డు ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

అతిసారంపై అశ్రద్ధ వహిస్తే ప్రాణాపాయం

పెదగంట్యాడ: వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల్లో అతిసారం ఒకటని, దీనిపై అశ్రద్ధ వహిస్తే ప్రాణాపాయమని దేవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా అన్నారు. స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా దేవాడ పీహెచ్‌సీ పరిధిలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లల్లో అతిసారం రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బిడ్డకు ఆరు నెలలు వచ్చే వరకూ తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. చిన్నారులకు విరేచనాలు అయితే కంగారు పడకుండా వెంటనే వైద్యులకు చూపించాలన్నారు. అలాగే వారికి ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తాగించాలని, నిర్దేశించిన మోతాదులో జింక్ మాత్రలు వేయాలన్నారు. పిల్లలకు ఆహారం తినిపించే ముందు చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. ఎవరికైనా జ్వరం వచ్చి మూడు రోజులైనా తగ్గకపోతే వెంటనే ఆస్పత్రులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ అన్నపూర్ణ, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు, హెచ్‌ఎస్ బి.గోపాలం, వెంకటలక్ష్మి, సునీత పాల్గొన్నారు.



అతిసారంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజా

1236వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు

అగనంపూడి: ప్రమాదపుటంచుల్లోకి నెట్టబడిన విశాఖ ఉక్కుపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణం స్పందించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు కోరారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు సోమవారానికి 1236వ రోజుకు చేరాయి. కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కును పరిరక్షించాలంటే రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుంటేనే సాధ్యమన్నారు. ఈ విషయంలో ముందుచూపుతో వ్యవహరించకపోతే రాష్ట్ర ప్రజలు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలపై పెట్టుకున్న నమ్మకం కూడా పోతుందని అన్నారు. మూడున్నర సంవత్సరాలుగా అగమ్యగోచరంగా ఉన్న విశాఖ ఉక్కును సరిదిద్దడానికి సంకీర్ణ ప్రభుత్వంలోని మూడు పార్టీల నాయకులు కదలి రావాలన్నారు. కార్యక్రమంలో దాసరి సురేష్, కామేశ్వరరావు, శ్రీనివాస్, సీతారామరాజు బషీర్‌బాబు, రామకృష్ణ, గోపాలరాజు, రాజేంద్రనాథ్, భాస్కరరావు పాల్గొన్నారు.



దీక్ష శిబిరంలో పాల్గొన్న ఉక్కు కార్మిక సంఘాల నేతలు

డయేరియాతో ఒక్కరూ చనిపోరాదు

డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : అతిసారతో ఒక్కరూ చనిపోరాదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కొబ్బరితోట వద్ద స్టాప్ డయేరియాపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. అతిసార వ్యాధిని ఎలా గుర్తించాలి..?, ఎలా నివారించాలో..? తెలియజేశారు. వాంతులు, విరేచనాలు సంభవించినప్పుడు ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి ఓఆర్‌ఎస్ ద్రావణం ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. ఐదేళ్లలోపు పిల్లల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టించడం, చేతులు శుభ్రంగా ఉంచడం, వ్యాధి నిరోధక టీకాలు తరచూ వేయించాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్లు కె.పద్మావతి, కె.నాగరాజు, జీవీఎంసీ సీఎంహెచ్‌వో డాక్టర్ నరేష్ కుమార్, వివిధ విభాగాల డాక్టర్లు ఎస్.జీవన రాణి (జిల్లా టీకాల అధికారి), డాక్టర్ బి.ఉమావతి (నోడల్ అధికారి), జిల్లా మీడియా విస్తరణ అధికారి(డిమో) బి.నాగేశ్వర రావు, డీపీవో శశిభూషణ్, శ్రీలత, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

'న్యాయ సంహిత' రద్దు చేయాలని ఆందోళన

పరవాడ: భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. లంకెలపాలెం కూడలిలో సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో రిక్షా కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత చట్టంలో పేర్కొన్న సెక్షన్ 106/(1), (2) డ్రైవర్లకు గుదిబండగా మారిందన్నారు. యాక్సిడెంట్ కేసుల్లో డ్రైవర్లకు ఏడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించడానికి ఆస్కారం ఉన్న ఈ చట్టం అత్యంత ప్రమాదకరమైందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టకుండా డ్రైవర్లను బాధ్యులను చేయడం సరికాదన్నారు. చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని గనిశెట్టి హెచ్చరించారు. కార్యక్రమంలో లంకెలపాలెం ఆటో యూనియన్ నాయకులు ఎస్.గోవింద్, కె.అప్పారావు, ఎస్.మురిలి, డి.మధు, వై.నాగేష్, ఎస్.సన్యాసిరావు, రాంబాబు పాల్గొన్నారు.



లంకెలపాలెంలో ఆందోళన చేస్తున్న ఆటో రిక్షా కార్మిక యూనియన్ నాయకులు

నేటి నుంచి డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు

డాబాగార్డెన్స్: అల్లూరి 127వ జయంతోత్సవాలను పురస్కరించుకొని పాఠశాల పిల్లలు, కళాశాల విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్టు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ప్రతినిధి దండు నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ఈ నెల 2 నుంచి 4 వరకు పోటీలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు మరిన్ని వివరాలకు 94907 50661లో సంప్రదించాలని సూచించారు.

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు యాదవ జగ్గరాజుపేట సమీపంలోని గ్రీన్‌సిటీలో కొలువుదీరిన శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం ప్రాతఃకాల ఆరాధన, సాయంత్రం గరుడ సేవ ఘనంగా నిర్వహించారు. 2వ తేదీ ఉదయం ప్రాతః కాల ఆరాధన, సుదర్శన హోమం, సాయంత్రం కల్ప వృక్ష వాహన సేవ జరిపించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. 3న ఉదయం మహాలక్ష్మి హోమం, గజ వాహన సేవ, సాయంత్రం సింహ వాహన సేవ, 4వ తేదీ ఉదయం మహా పూర్ణాహుతి, సాయంత్రం హనుద్వాహన సేవ ఉంటాయన్నారు. 5వ తేదీ ఉదయం భక్తి గీతాంజలి, మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలియజేశారు.

86వ వార్డులో ఎముకల సాంద్రత పరీక్షలు



ఎముకల సాంద్రతను పరీక్షిస్తున్న సిబ్బంది

అగనంపూడి: జీవీఎంసీ 86వ వార్డులో సోమవారం ఉచిత ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహించారు. మీనాక్షి డెంటల్, ఆర్థో, ఫిజియో థెరపీ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో కేజీహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ పీటీవీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఎముకల వ్యాధులు, సాంద్రత తదితర అంశాలను వివరించారు. రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, సలహాలు అందించారు. వంద మందికి ఎముకల స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు బి.దివాకర్, బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.జగదీశ్వరరావు, డాక్టర్ నివేదిత, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి స్వర్ణ పుష్పార్చన నేడు

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి, పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. లేదా ఈ-మెయిల్ ఐడీ endow-eokanaka@gov. in ద్వారా తెలుసుకోవచ్చు.

స్వచ్ఛతపై అవగాహన

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ పక్షోత్సవాలు సోమవారం మొదలయ్యాయి. ఈ నెల 15 వరకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. తొలి రోజు హెచ్‌పీసీఎల్ ప్రధాన గేటు వద్ద సంస్థ ఈడీ (వీఆర్)ఆర్.రామకృష్ణన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడారు. పరిశుభ్రమైన వాతావరణం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. జానపద కళాకారులు తమ నృత్య ప్రదర్శన ద్వారా గీతాలను ఆలపిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



స్వచ్ఛతపై ప్రదర్శన ఇస్తున్న జానపద కళాకారులు

వైద్యుల సేవలు అమూల్యం

అగనంపూడి: రోగుల ప్రాణాలను కాపాడటంతో వైద్యులు అందించే సేవలు అమూల్యమని అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతి అన్నారు. అందుకే వైద్యుడిని దేవుడి తర్వాత అంతటి వారిగా కొలుస్తారని, ఆ గౌరవాన్ని కాపాడుకోవాలని అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా అగనంపూడి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతిని స్థానిక నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులు, బాధితులను రక్షించే సామర్థ్యం కేవలం వైద్యులకే ఉందని, అటువంటి వైద్య వృత్తిలో ఉన్నవారు వాటిని కాపాడుకుంటేనే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ముందుగా కేక్ కట్ చేసి సిబ్బందికి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ ఉష, వైద్యులు గోపాలకృష్ణ, భక్తవత్సలం, ప్రత్యూష, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, ఆస్పత్రి కమిటీ మాజీ చైర్మన్లు కరణం సత్యారావు, కొరాయి జగదీష్, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, గంతకోరు అప్పారావు, డొక్కా రమేష్ , పి.వి.రమణ పాల్గొన్నారు.



అగనంపూడి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతిని సత్కరిస్తున్న నాయకులు

వారంలో ఒకరోజు ప్రజారవాణా వినియోగిద్దాం

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. తన బంగ్లా నుంచి సోమవారం సైకిల్‌పై జీవీఎంసీకి చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒకరోజు ప్రజా రవాణాను వినియోగించే నిర్ణయం మేరకు జీవీఎంసీ ఉద్యోగులతో పాటు అందరం దానిని అమలు చేస్తున్నామన్నారు. ఎకో వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక చర్యలు చేపడుతోందని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించడం వల్ల విశాఖ నగరంలో కాలుష్య నియంత్రణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



తన బంగ్లా నుంచి జీవీఎంసీకి సైకిల్‌పై వస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

జగన్నాథస్వామి ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, తదితరులు

డాబాగార్డెన్స్ : టౌన్ కొత్తరోడ్డులో వెలసిన జగన్నాథ స్వామి రథయాత్ర ఉత్సవాలను పురస్కరించుకొని ప్రచార రథాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామి సేవలో పాల్గొనే భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఈవోకు సూచించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రాజగోపాల్‌రెడ్డి, అర్చకుడు జగన్నాథాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.